గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

మోతీనగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం గ్రామానికి చెందిన యాపుగంటి ఫణికిరణ్‌కి అదే గ్రామానికి చెందిన నాగవర్మ అలియాస్ నాగు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో ఇద్దరూ గంజాయి తాగడం అలవాటు చేసుకున్నారు. 2016 సంవత్సరంలో ఫణి కిరణ్ ఉద్యోగరిత్యా హైదరాబాద్ వచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. గంజాయి తాగే అలవాటు ఉన్న ఫణి కిరణ్ తన వెంట గంజాయి తెచ్చుకొని హైదరాబాదులో పరిచయమైన సహ ఉద్యోగులు, స్నేహితులతో కలిసి నిర్మానుష ప్రాంతంలో గంజాయి తాగేవాడు. ఈ క్రమంలో కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా హైదరాబాదులో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఇందు కోసం తన పాత స్నేహితుడైన నాగవర్మ నుంచి ఒక కేజీ గంజాయి రూ. పదివేల చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్ తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి హైదరాబాదులో గంజాయి విక్రయించడం ప్రారంభించాడు. మాదాపూర్ పోలీసులకు అందిన సమాచారంతో కానామిట్టలో శ్రీకర కో లివింగ్ పీజీ హాస్టల్‌లో ఫణి కిరణ్ గదిలో తనిఖీలు చేయగా 1643 గ్రాముల గంజాయిని గుర్తించారు. గుర్తించిన గంజాయితోపాటు నిందితుడి సెల్‌ఫోన్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ విషయమై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫణికిరణ్‌తో పాటు అతడికి గంజాయి సరఫరా చేస్తున్న నాగువర్మపై కేసు నమోదు చేసి ఫణికిరణ్‌ని శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా, మరో ముద్దాయి పరారీలో ఉన్నట్టు తెలిపారు.

కంపెనీ సొమ్ము
సొంత ఖాతాకు మళ్లించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కంపెనీని మోసం చేసి రూ. 18.50 లక్షలు సొంతఖాతాకు మళ్లించిన ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న క్యూ హబ్ సంస్థ నగరంలోని మెట్రో స్టేషన్ల కింద ఉన్న షాపులను లీజు పద్ధతిలో తీసుకుంది. ఈ షాపులను ప్రైవేట్ వ్యాపారులకు అద్దెకు ఇచ్చింది. ప్రతినెల సంస్థ బ్యాంకు ఖాతాలో అద్దెను జమచేస్తారు. ఆరు నెలలుగా వ్యాపారులు అద్దె కట్టడం లేదు. దీంతో షాపులు ఖాళీ చేయించాలని సంస్థ నిర్ణయించింది. ఈప్రక్రియ చేసేందుకు వ్యాపారులను కలవగా వారు అద్దెను అడ్వాన్స్‌గా చెల్లించినట్టు చెప్పారు. వాకబు చేయగా అద్దెలు వసూలు చేసే గడ్డిరాజు విజయకృష్ణంరాజు వ్యాపారులకు మాయ మాటలు చెప్పి అద్దెను అడ్వాన్స్ రూపంలో తీసుకొని తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించాడు. సుమారు రూ.18.50లక్షలు వసూలు చేసి వాడుకున్నట్టు తేలింది. సంస్థ నిర్వాహకులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నగదు పంపుతానని మోసం

యుసుఫ్‌గూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌కు వచ్చిన వ్యక్తి వద్ద నుంచి నగదు తీసుకుని ఆన్‌లైన్‌లో పంపుతానని ఓ యువకుడు మోసానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మధురాగర్ కాలనీలో నివాసముంటున్న విశాంత్‌రెడ్డి గత నెల 28వ తేదీ ఎల్లారెడ్డిగూడలోని స్టేట్‌బ్యాంక్‌కు వెళ్లాడు. రూ. లక్ష డిపాజిట్ చేసే సమయంలో పక్కనే ఉన్న ఇంటిపల్లి రామారావు అనే వ్యక్తి తనకు డబ్బు ఇస్తే ఆన్‌లైన్‌లో నగదు పంపుతానని చెప్పాడు. విశాంత్‌రెడ్డి సమక్షంలోనే ట్రాన్స్‌ఫర్ చేశాడు. తనకు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. కానీ విశాంత్‌రెడ్డికి క్రెడిట్ అయినట్టు మెసేజ్ రాలేదు. సర్వర్ సమస్య ఉన్నట్టుంది సాయంత్రానికి క్రెడిట్ అవుతుందని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన విశాంత్‌రెడ్డి రూ.లక్ష రామారావుకు ఇచ్చాడు. మరునాడు రామారావు స్వయంగా ఫోన్ చేసి సర్వర్ సమస్య ఉంది సాయంత్రానికి క్రెడిట్ అవుతుందని చెప్పాడు. ఐనా తన అకౌంట్‌లో డబ్బు పడక పోవడంతో తను మోసపోయానని గుర్తించిన విశాంత్‌రెడ్డి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహనాన్ని ఢీ కొట్టాడని వ్యక్తిపై దాడి

- ముగ్గురిపై కేసు

పంజాగుట్ట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట ప్రధాన రహదారిలో ముందు వెళ్తున్న తమ వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీ కొట్టినందుకు ఆగ్రహించిన వాహనదారులు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా కొట్టారు. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ దెబ్బలు తిన్న వాహనదారుడిని రక్షించి, అతడిపై దాడి చేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని పంజాగుట్ట పీఎస్‌కు తరలించారు.

పఠాన్‌చెరు ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ శనివారం మధ్యాహ్నం ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మార్గంమధ్యలో ఎర్రమంజిల్ వద్ద అదుపు తప్పి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. వాహనంపై ఉన్న రాంనగర్‌కు చెందిన రోహిత్ అవస్థీ, మోహిత్ అవస్థీతో పాటు మరో వాహనం నడుపుతున్న ముఖేష్ కుమార్ ఒక్కసారిగా చంద్రశేఖర్‌ను కొట్టారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ వారిని వారించి పంజాగుట్ట పీఎస్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. బాధితుడిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

'పోలీసు విధులు గర్వకారణం'


యుసుఫ్‌గూడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి భద్రత కోసం సమాజంలో శాంతి కోసం నిరంతరం పోలీసులు శ్రమిస్తుంటారని టీఎస్ఎస్‌పీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా అన్నారు. యూసుఫ్‌గూడలోని ప్రథమ పటాలంలో శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వాతి లక్రా మాట్లాడుతూ... పోలీసుల బాధ్యత ఎంతో గర్వకారణమైనదని, మనం వేసే ప్రతి అడుగు సమాజ శ్రేయస్సు కోసమేనని, ఇందు కోసం ఎన్ని రకాల ఆటంకాలు ఎదురైనా వెనుకంజ వేయకూడదన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి తమ బాధ్యతలను గుర్తెరిగి విధులను నిర్వర్తించాలన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులుగా నియమితులైన సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీ డీఐజీ సిద్దిఖీ, యూసుఫ్‌గూడ ప్రథమ పటాలం కమాండెంట్ పి.మురళీకృష్ణ, అడిషనల్ కమాండెంట్ నరేందర్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ కె.పి.సత్యనారాయణ, బి.జవహర్ లాల్, ఆర్ఐలు ధర్మారావు, శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై దాడులు ఆపాలి



మాట్లాడుతున్న గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్

బేగంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ మాఫియా అండతోనే పోలీసులు కల్లు దుకాణాలపై దాడులు చేస్తున్నారని, వెంటనే దాడులను ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. శనివారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్రస్థాయి కార్యవర్గ అత్యవసర సమావేశం జరిగింది. ఈసమావేశానికి గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిక్కర్ మాఫియాతో పోలీసులు కుమ్మక్కై కల్లు దుకాణాలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చొరవతీసుకొని ఈ దాడులను వెంటనే ఆపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 103 కల్లు సొసైటీలు ఉన్నాయని, వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. కల్లు షాపులు నిర్వహించే వారిపై బైండోవర్ కేసులు పెడతామని పోలీసులు బెదిరించడం దారుణమన్నారు. పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను 5 లక్షలను విడుదల చేయడంతో పాటు దీనిని పది లక్షలకు పెంచాలన్నారు. గీత కార్మికులకు సెఫ్టీ మోకులు ఇవ్వాలని కోరారు. గీత కార్మికుల ప్రమాదాలను అరికట్టడానికి బిహార్ నుంచి పొట్టి (పది అడుగులకు పెరిగే) విత్తనాలను తెప్పించి పంపిణీ చేయాలన్నారు. సమస్యలను మంత్రి పొన్న ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో నగరంలో గౌడ గర్జన పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్ గౌడ్, సంతోష్‌గౌడ్, సంజీవ గౌడ్, అనురాధ, దేవేందర్ గౌడ్, నాగరాజు గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



బోరబండ సైట్-1లో రంజాన్ మాసం సహర్ ఉపవాస దీక్షకు ముందు ముస్లిం యువతతో కలిసి భోజనం చేస్తున్న మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్
- బోరబండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి)

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- 10 ఎకరాలలో అక్రమ లేఅవుట్
- 5 ఎక్స్‌కవేటర్లతో కూల్చివేసిన అధికారులు



బేగంపేట ఫ్రైడ్ ఇండియా వెంచర్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

బేగంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని మాతాజీనగర్ సమీపంలోని ఓ బడా కంపెనీ వెంచర్‌లో అక్రమంగా వెలిసిన అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు శనివారం కూల్చివేశారు. ఉదయం సుమారు 5 ఎక్స్‌కవేటర్లతో బేగంపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి క్రిష్టోఫర్‌తో పాటు పలువురు అధికారులు పోలీస్ ప్రొటక్షన్‌తో కూల్చివేతలు చేపట్టారు. బాలానగర్ మండల పరిధిలోని బేగంపేట మాతాజీనగర్‌లోని సర్వే నెంబరు 194/8/1లో సుమారు 10ఎకరాల 20 గుంటల్లో 2015 సంవత్సరంలో ఫ్రైడ్ ఇండియా రియల్ ఎస్టేట్ కంపెనీ అక్రమ లేఅవుట్ చేసింది. ఈ వెంచర్‌లో 300లకు పైగా ప్లాట్లను వేసి పలువురికి విక్రయించారు. దీంతో అప్పట్లోనే జీహెచ్ఎంసీ, నీటి పారుదల శాఖలకు ఫిర్యాదులు రావడంతో ఇక్కడ వెలిసిన నిర్మాణాలను కూల్చి వేయడంతో పాటు స్థల యజమానులపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అధికారులు కూల్చిన కొద్ది రోజులకే మళ్లీ ఇక్కడ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇలా 2019, 2021 సంవత్సరంలో సైతం కూల్చివేతలు నిర్వహించారు. తాజాగా ఇటీవల ఎమ్మెల్యే ఎలక్షన్ల సమయంలో ఈ వెంచర్‌లో సుమారు 50కి పైగా నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో వారం రోజుల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ నిర్మాణాలు చేయొద్దని తెలిపారు. అందులో భాగంగా శనివారం జీహెచ్ఎంసీ అధికారులు పెద్ద ఎత్తున ఎక్స్‌కవేటర్లతో వచ్చారు. వెంచర్‌లో ఉన్న అన్ని ఇళ్లను కూల్చివేశారు. ఇళ్లల్లో ఉన్న వారిని వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేయొద్దని హెచ్చరించారు. ఇళ్ల కూల్చివేత క్రమంలో పలువురు ఇంటి యజమానులు అధికారులను అడ్డుకున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి స్థలాలు కొన్నామని, రిజిస్ట్రేషన్లు సైతం అయ్యాయని, కొన్న స్థలంలో ఇళ్లు నిర్మిస్తే ఎందుకు కూలుస్తున్నారని వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల సహాయంతో వెంచర్‌లో ని నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు.

భగత్‌సింగ్‌కు నివాళి



ఎస్సార్టీ నగర్‌లో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోరబండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): యువ కిశోరాలు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు పవనం శివశంకర్ అన్నారు. శనివారం ఎస్సార్టీ నగర్‌లో ముగ్గురు జాతీయ నాయకుల వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో దశరత్, లక్ష్మణమూర్తి, అబ్బాస్, నారాయణరెడ్డి, వెంకటస్వామి, తులసి, కాశీం పాల్గొన్నారు.



వెంగళరావునగర్ డివిజన్ రహమత్‌నగర్‌లోని గురుద్వారా కమాన్ వద్ద సర్దార్ భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నవీన్ యాదవ్, అజ్జుబాయ్, గురుదీప్ సింగ్, బాబు సింగ్,బల్వంత్ సింగ్, కుల్వంత్ సింగ్
- వెంగళరావునగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి)

సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో...

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా సీపీఎం ప్రజా సంఘాల నాయకులు టి.సాయిశేషగిరిరావు, సీఐటీయూ నాయకులు రాపర్తి అశోక్ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఫిలింనగర్‌లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు గందె అరుణ్‌కుమార్ తదితరులు
- బంజారాహిల్స్, మార్చి 23(ఆంధ్రజ్యోతి)



అమీర్‌పేటలోని సత్యం టాకీస్ చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, పార్టీ శ్రేణులు, సిక్కులు
- అమీర్‌పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి)

'శ్మశాన వాటికలో అక్రమాలను అరికడతాం'

బోరబండ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సైట్-3 ఉమ్మడి బస్తీల శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించడంలో ప్రస్తుత కమిటీ అధ్యక్షుడు విఫలమయ్యారని కమిటీ ఇన్‌చార్జి వేముల యాదయ్య ఆరోపించారు. శనివారం సైట్-3 బొందల గడ్డను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్మశాన వాటి సమాదులతో నిండిపోతుందని, రానున్న రోజుల్లో బొందలు పెట్టడానికి స్థలం ఉండదన్నారు. ప్రస్తుత కమిటీ పెద్దలు కొంత మంది చనిపోయిన వారి సమాదుల నిర్మాణం కోసం రూ. 30 వేయిల నుంచి రూ. 50 వేయిలు అక్రమంగా వసూల్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బొందల గడ్డలో శవాన్ని పూడ్చకపోయినా రూ. 5 వేయిల నుంచి రూ. 10వేయిలు తీసుకొని ఇక్కడ పూడ్చినట్టు రశీదు ఇస్తున్నారన్నారు. ఈ విషయాలపై ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

గణితం పరీక్షకు 53 మంది డుమ్మా

బోరబండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 2024 పదో తరగతి రెగ్యూలర్ పరీక్షకు మొత్తం 53మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. శనివారం జరిగిన గణితం రెగ్యూలర్ పరీక్షకు 7,998 మంది విద్యార్థులకు గాను 7,960 మంది హాజరయ్యారు. 38 మంది పరీక్ష రాలేదు. సప్లమెంటరీ పరీక్ష రాసే విద్యార్థులు 93 మందికి 78మంది హాజరయ్యారు. మిగిలిన 15మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఖైరతాబాద్ జోన్ ఉప విద్యాశాఖధికారి శ్యామ్యూల్ రాజ్ తెలిపారు.

టీఆర్‌టీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ)లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పెరిక యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలలపాటు ఉచిత రెసిడెన్షియల్ (వసతి)తోపాటు శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. డీఈడీ (టీటీసీ), బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై టీఆర్‌టీ (డీఎస్సీ)-2024కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ యజమాని వార్షిక ఆదాయం రూ. 3 లక్షలకు మించకూడదన్నారు. అభ్యర్థులు ఈనెల 26లోపు tsstudycircle.co.inవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కెమెరా లెన్స్‌ల చోరీ

అఫ్జల్‌గంజ్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఫంక్షన్ హాల్ నుంచి కెమెరాకు సంబంధించిన విలువైన లెన్స్‌లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. అత్తాపూర్‌కు చెందిన రాజు ఫొటోగ్రాఫర్ జియాగూడ సబ్జిమండి వద్ద ఉన్న ఫంక్షన్‌హాల్లో కవరేజీకి వచ్చాడు. కొంతసేపటి తర్వాత కెమెరా లెన్స్‌లను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ వెంటే మాల సామాజిక వర్గం



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, తదితరులు

పంజాగుట్ట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాల సామాజిక వర్గం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వెన్నంటే ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. తమ సామాజిక వర్గానికి పెద్దపల్లి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానాలను ఇచ్చినందుకు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మాలలు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వెన్నంటే ఉన్నారని, దళిత బలహీన వర్గాల పార్టీ అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదని చెన్నయ్య అన్నారు. మూడు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉంటే కాంగ్రెస్ పెద్ద పీట వేసిందని, మిగతా పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ఇస్తూ, కాంగ్రెస్ పార్టీని ఎంపీ సీట్లు అడగడం శోచనీయమన్నారు. జి.వెంకటస్వామి, కుటుంబం మల్లు అనంతరాములు కుటుంబాలపై అనవసరంగా ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారన్నారు. మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూరుగుల వెంకటేశ్వర్లు, జి.రమేష్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.రాజేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, కళ్యాణ్, రమేష్, ఆదర్శ్, తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.



- గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలలో మెన్స్ సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన వనస్థలిపురం ఏసీపీ పి.కాసిరెడ్డిని కమిషనరేట్‌లో సీపీ తరుణ్ జోషి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని, అందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామన్నారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి)

మంచినీటి సరఫరాలో అంతరాయం



వాటర్ లైన్‌వాల్వ్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

వెంగళరావునగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ బీ, డీ బ్లాక్ వాసులకు మూడు రోజులుగా మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులు, సిబ్బంది సమస్య ఎక్కడ ఉందో తెలుసుకున్నారు. అయ్యప్ప మైదానం సమీపంలో మ్యాన్ హోల్‌లో ఉన్న వాటర్ లైన్ వాల్వ్ తిరగక పోవడంతోనే నీటి సరఫరా కావడంలేదని జలమండలి అధికారులు గుర్తించారు. వాల్వ్‌కు మరమ్మతులు చేయడానికి మ్యాన్ హోల్ తవ్వినా చెట్టు వేర్లు అడ్డుపడడంతో సాధ్యం కాలేదు. చివరికి కార్మికులు చెట్టు వేర్లను తొలగించి శనివారం వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తి అయిన తర్వాత నీటి సరఫరా ఉంటుందని అధికారులు తెలిపారు.

రోడ్డు విస్తరణకు పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీవాస్తవ్, ఈఈ రాజ్‌కుమార్

యుసుఫ్‌గూడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ - మోతీనగర్‌లో చేపట్టనున్న రోడ్డు విస్తరణ నేపథ్యంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు రోడ్డును పరిశీలించారు. శనివారం అడిషనల్ కమిషనర్ శ్రీవాస్తవ్, ఈఈ రాజ్‌కుమార్, డీఈ రామచంద్రరాజు, ఎస్ఈ శంకర్‌నాయక్‌తో పాటు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి రోడ్డు విస్తరణలో తీసుకోవాల్సిన చర్యలు, తొలగించాల్సిన అడ్డంకులు తదితర వాటిని పరిశీలించారు.

న్యాయవాదికి సన్మానం



రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

యుసుఫ్‌గూడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వికారాబాద్ జిల్లాకు చెందిన ఎం.రాజ్‌కుమార్‌ను తోటి న్యాయవాదులు సన్మానించారు. ఎల్లారెడ్డిగూడలోని పడాలరామిరెడ్డి న్యాయ కళాశాల 2003 బ్యాచ్ న్యాయవాదులు శనివారం యూసుఫ్‌గూడలో ఆయనను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కర్దాస్ పవన్, ఎం.పెంటారెడ్డి, నాయిని రవీందర్‌రెడ్డి, జయరాజ్, భాస్కరాచారి, సతీష్, ఇంద్రసేనారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డ, దాసరి వేణుగోపాల్, వి.రమణారెడ్డి, ఎం.రాజేష్ యాదవ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రోనాల్డ్‌రోస్‌ను కలిసిన తెలంగాణ స్వచ్ఛ ఆటోటిప్పర్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్

హైదరాబాద్ సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్వచ్ఛ ఆటోటిప్పర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిప్పర్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందజేయాలని కమిషనర్‌ను కోరినట్టు తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఈ కోటేశ్వర్‌రావు, యూనియన్ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, హంసరాజు, అర్జున్, శేఖర్, పరుశురాం, మచ్చగిరి పాల్గొన్నారు.

'కేజ్రీవాల్ అరెస్ట్ అక్రమం'

అమీర్‌పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం అక్రమమని ఆమ్‌ఆద్మీ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జైసింగ్ జాదవ్ అన్నారు. శనివారం బాపూనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీ మద్యం స్కాంలో కేజ్రీవాలే ప్రధాన నిందితుడని ఈడీ పేర్కొనడం దారుణమన్నారు. ఇలాంటి దారుణాలను ప్రజలు ముక్త కంఠంతో ఖండించాలని జైసింగ్ జాదవ్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ, బీఆర్ఎస్ నాయకులు

అమీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ సమక్షంలో శనివారం టీడీపీ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో బాపూనగర్‌కు చెందిన విద్యార్థి చౌహాన్, అమీర్‌పేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడితో పాటు అంకమ్మ బస్తీకి చెందిన రంగమ్మ, సాయితో పాటు మరో వంద మంది చేరినట్టు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

ట్యాంకర్లకు రూ. 2 వేలు

(5వ పేజీ తరువాయి)

గృహావసరాలకు రూ.500కు, వాణిజ్య అవసరాలకు రూ.850కు విక్రయిస్తున్నది. ప్రైవేట్‌ట్యాంకర్ల దోపిడీని భరించలేని మాదాపూర్ ప్రాంతంలోని నివాసితులు కొత్త ఉపాయం పన్నారు. స్నేహితులు, పరిచయస్తులు, బంధువుల ఇళ్ల పేరిట వాటర్‌బోర్డు ట్యాంకర్‌ను బుక్ చేసుకుని నీటిని తెప్పించుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో..

మాదాపూర్, గుట్టలబేగంపేట ప్రాంతాల్లోని సున్నంచెరువు పరిసర ప్రాంతాల్లో కొందరు పెద్దఎత్తున బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. రోజుకు వందలాది ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను సామర్థ్యాన్ని బట్టి రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల నిర్లక్ష్యంవల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని జనం వాపోతున్నారు.

25 ప్రాంతాల్లో డిమాండ్

గ్రేటర్ పరిధిలోని 25 ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా మాదాపూర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, మియాపూర్, హఫీజ్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, మణికొండ, మూసాపేట, కేపీహెచ్‌బీ, భరత్‌నగర్, గచ్చిబౌలి, ఎల్లారెడ్డిగూడ, రాయదుర్గం, కొండాపూర్ తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్‌లకు బుకింగ్‌లు ఎక్కువగా అవుతున్నాయి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన 1,300 ట్యాంకర్లు బుకింగ్ కాగా, మార్చి 22న 4,079 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. రెండు నెలల వ్యవధిలోనే మూడింతల డిమాండ్ పెరగడం నీటి కొరత, అవసరానికి అద్దం పడుతున్నది. కాగా బస్తీలతో పాటు ఆలయాలు, మసీదులు తదితర వాటికి జనవరి ఒకటో తేదీన 350 ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని అందిస్తే.. ప్రస్తుతం రోజుకు 637 ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. మున్ముందు మరింత అధికంగా ట్యాంకర్ల బుకింగ్ పెరిగే అవకాశాలున్నాయి.

ఆ ఏడు డివిజన్లలో 84 శాతం డిమాండ్

వాటర్‌బోర్డు పరిధిలో దాదాపు 580కి పైగా ట్యాంకర్లున్నాయి. వీటి ద్వారా ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు.. రెండు షిఫ్టుల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. వాటర్‌బోర్డు పరిధిలో మొత్తం 24 డివిజన్లు ఉండగా, ఆరు డివిజన్లలోనే ట్యాంకర్ డిమాండ్ 84 శాతం మేరకు ఉన్నది. అందులో.. 35 శాతం హఫీజ్‌పేట, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి(డివిజన్-15)లలో, 22శాతం ఎస్ఆర్‌నగర్(డివిజన్-6)లో, 14 శాతం కూకట్‌పల్లి(డివిజన్-9)లో, 7 శాతం మణికొండ(డివిజన్-18)లో, ఆరు శాతం నిజాంపేట్(డివిజన్-23)లో డిమాండ్ ఏర్పడుతున్నది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా నీటిని సరఫరా చేయడానికి అదనంగా మరిన్ని ట్యాంకర్లను సమకూర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పగటి సమయంలోనూ ఆయా ప్రాంతాల్లో వాహనాల రద్దీ కారణంగా డెలివరీ ఆలస్యమవుతోంది. దీంతో ట్రిప్పుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో వీధుల్లో ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. దీంతో రాత్రి సమయాల్లో అదనంగా మరో షిఫ్ట్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

'బీసీలకు 10 సీట్లు కేటాయించాలి'

రాంనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 10సీట్లు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కేటాయించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ డిమాండ్లపై విధాన ప్రకటన చేసి తమ మ్యానిఫెస్టోలో పార్టీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 15లక్షల ఉద్యోగాలను ప్రకటించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అధ్యక్షతన బీసీ జోడోయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలకు తక్కువ సీట్లు ఇచ్చి అన్యాయం చేశాయని ఆరోపించారు. మొత్తం కేంద్ర బడ్జెట్‌లో 47 కోట్ల 65 లక్షల 768 కోట్లు బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి బిక్షం ఇచ్చినట్లుగా కేవలం 2150కోట్లు బడ్జెట్ మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన మొత్తం చూస్తే దేశంలో 75 కోట్ల మంది బీసీలకు పంచితే చాక్లెట్లు, బిస్కెట్లు కూడా రావని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు అన్ని పార్టీలు ఇవ్వాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364



స్ట్రీట్ వెండర్స్‌కు అవగాహన కల్పిస్తున్న డీసీ సమ్మయ్య, అధికారులు

స్ట్రీట్ వెండర్స్ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలి

- రోడ్డు మీద చెత్త వేస్తే జరిమానా విధిస్తాం

రెజిమెంటల్‌బజార్,మార్చి 23(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు చెత్తను అటోలలో వేయకుండా రోడ్డు మీద వేస్తే జరిమానా విధిస్తామని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. శనివారం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్ గండిమైసమ్మ కమాన్ వీధిలో వ్యాపారులు చెత్త వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారుతోంది. దీంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఇన్‌గేట్ పరిసర ప్రాంతాలలో వ్యాపారం చేసుకునే పండ్ల వ్యాపారులతో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడారు. డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకుని చెత్తను డస్ట్‌బిన్‌లలో వేయాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసీడీలు యాదయ్య, సుధాకర్, నీరజ, ఎస్‌ఎస్ ధనాగౌడ్, జవాన్ నర్సింగరావు, ఎస్‌ఎఫ్‌ఏ రేణులత తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో ఎస్‌సీఆర్ జట్టు

చాంపియన్ 'ఎస్‌సీఆర్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): శామ్యూల్ వసంత్ కుమార్ స్మారక బాస్కెట్‌బాల్ ట్రోఫీని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జట్టు సొంతం చేసుకుంది. స్పోర్ట్స్ రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (ఎస్‌డబ్ల్యూఏటీ), రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కలిసి సికింద్రాబాద్ వైఎంసీఏలో నిర్వహించిన ఈ టోర్నీ ఫైనల్లో ఎస్‌సీఆర్ 83-54తో వైఎంసీఏ సికింద్రాబాద్ జట్టుపై ఘన విజయం సాధించింది. ఎస్‌సీఆర్ ప్లేయర్లలో విజయ్ 26, ఆకాష్ 19 పాయింట్లు సాధించి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. టోర్నీ అత్యంత విలువైన ప్లేయర్ అవార్డు వివేక్ (వైఎంసీఏ)కు దక్కింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గిరిధర్, ప్రేమ్ రాజ్ విజేతకు ట్రోఫీను బహూకరించారు.

పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అడిషనల్ ఎస్పీ వెంకట్రావుకు 2 పతకాలు



అడిషనల్ ఎస్పీ గంటా వెంకట్రావు

హైదరాబాద్‌సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి పుల్లెల గోపీచంద్ అకాడమీలో నిర్వహించిన ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ పోలీస్ అకాడమీలో అడిషన్ ఎస్పీగా పనిచేస్తున్న గంటా వెంకట్రావు రెండు పతకాలు సాధించారు. వెంకట్రావు 1991 బ్యాచ్ ఎస్‌గా ప్రయాణం ప్రారంభించారు. 25 ఏళ్లుగా వెంకట్రావు విధి నిర్వహణతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపుతున్నారు. ఈ ఏడాది పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 55 ప్లస్ కేటగిరిలో 2 రజత పతకాలు సాధించారు. 2017లో నిర్వహించిన చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించారు.

ట్యాంకర్లకు రూ. 2 వేలు

(5వ పేజీ తరువాయి)

గృహావసరాలకు రూ.500కు, వాణిజ్య అవసరాలకు రూ.850కు విక్రయిస్తున్నది. ప్రైవేట్‌ట్యాంకర్ల దోపిడీని భరించలేని మాదాపూర్ ప్రాంతంలోని నివాసితులు కొత్త ఉపాయం పన్నారు. స్నేహితులు, పరిచయస్తులు, బంధువుల ఇళ్ల పేరిట వాటర్‌బోర్డు ట్యాంకర్‌ను బుక్ చేసుకుని నీటిని తెప్పించుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో..

మాదాపూర్, గుట్టలబేగంపేట ప్రాంతాల్లోని సున్నంచెరువు పరిసర ప్రాంతాల్లో కొందరు పెద్దఎత్తున బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. రోజుకు వందలాది ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను సామర్థ్యాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని జనం వాపోతున్నారు.

25 ప్రాంతాల్లో డిమాండ్

గ్రేటర్ పరిధిలోని 25 ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా మాదాపూర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, మియాపూర్, హఫీజ్‌పేట, జూబ్లీహిల్స్ బంజారాహిల్స్, ఎస్‌ఆర్‌నగర్, మణికొండ, మూసాపేట, కేపీహెచ్‌బీ, భరత్‌నగర్, గచ్చిబౌలి, ఎల్లారెడ్డిగూడ, రాయదుర్గం, కొండాపూర్ తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్‌లకు బుకింగ్‌లు ఎక్కువగా అవుతున్నాయి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన 1,300 ట్యాంకర్లు బుకింగ్ కాగా, మార్చి 22న 4,079 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. 2 నెలల వ్యవధిలోనే మూడింతల డిమాండ్ పెరగడం నీటికొరత, అవసరానికి అద్దం పడుతున్నది. కాగా బస్తీలతోపాటు ఆలయాలు, మసీదులు తదితర వాటికి జనవరి ఒకటో తేదీన 350 ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటినిఅందిస్తే.. ప్రస్తుతం రోజుకు 637 ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. ముున్ముందు మరింతఅధికంగా ట్యాంకర్ల బుకింగ్ పెరిగే అవకాశాలున్నాయి.

ఆ ఏడు డివిజన్లలో 84 శాతం డిమాండ్

వాటర్‌బోర్డు పరిధిలో దాదాపు 580కి పైగా ట్యాంకర్లున్నాయి. వీటి ద్వారా ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు.. రెండు షిఫ్టుల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. వాటర్‌బోర్డు పరిధిలో మొత్తం 24 డివిజన్లు ఉండగా, ఆరు డివిజన్లలోనే ట్యాంకర్ డిమాండ్ 84 శాతం మేరకు ఉన్నది. అందులో.. 35 శాతం హఫీజ్‌పేట, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి(డివిజన్-15)లలో, 22 శాతం ఎస్‌ఆర్‌నగర్(డివిజన్-6)లో, 14 శాతం కూకట్‌పల్లి(డివిజన్-9)లో, 7 శాతం మణికొండ(డివిజన్-18)లో, ఆరు శాతం నిజాంపేట్(డివిజన్-23)లో డిమాండ్ ఏర్పడుతున్నది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా నీటిని సరఫరా చేయడానికి అదనంగా మరిన్ని ట్యాంకర్లను సమకూర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పగటి సమయంలోనూ ఆయా ప్రాంతాల్లో వాహనాల రద్దీ కారణంగా డెలివరీ ఆలస్యమవుతోంది. దీంతో ట్రిప్పుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో వీధుల్లో ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. దీంతో రాత్రి సమయాల్లో అదనంగా మరో షిఫ్ట్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కాల్వ సుజాతను శనివారం ఇంటర్‌నేషనల్ వైశ్యఫెడరేషన్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్య వైశ్య సంఘం తుకారాంగేట్ సీనియర్ సభ్యుడు శ్రీనివాస్, అధ్యక్షుడు రవీందర్, ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ మాజీ సీనియర్ అధ్యక్షుడు వీరేశం, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లతో పాటు పలువురు వైశ్య సంఘాల ప్రతినిధులు గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

రోడ్లపై చెత్త వేయకుండా అవగాహన

- అడ్డగుట్ట యూసీడీ సిబ్బంది స్పెషల్ డ్రైవ్



అడ్డగుట్ట లోహియానగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులతో ప్రతిజ్ఞ చేస్తున్న బస్తీవాసులు

అడ్డగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లో చెత్తను తరలించడంలో జీహెచ్‌ఎంసీ విభాగం రిసోర్స్ పర్సన్ల పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రతిరోజు అడ్డగుట్ట లోహియనగర్‌లోని కాలనీల్లోకి రిసోర్స్ పర్సన్లు ఇంటింటికీ వెళ్లి చెత్తను రోడ్లపై వేయకూడదని, మీ ఇంటికే ఆటో ట్రాలీ వస్తుందని, అందులోనే చెత్త వేయాలని సూచిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల దుర్వాసన వస్తుందని అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువవుతున్నారు. ఇంటికే వస్తున్న ఆటో ట్రాలీలో చెత్త వేసేందుకు ప్రతి ఇంటి సభ్యుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటూ శనివారం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం లోహియానగర్‌లో ప్రతిజ్ఞ చేశారు.

రోడ్లపై చెత్త వేయవద్దు



అడ్డగుట్ట డివిజన్‌లో లోహియనగర్, అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాలలో చెత్త తీసుకెళ్లేందుకు ఆటో ట్రాలీలు ఇంటికే వస్తుంటాయి. మీ చెత్తను రోడ్లపై వేయకుండా ఆటో ట్రాలీ వాళ్లకే ఇవ్వాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్నాం. వారం రోజుల నుంచి ప్రతిరోజు రోజుకోక తీరులో ర్యాలీ, ప్లకార్డుల, ముగ్గులు వేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

- పుష్పలత, రిసోర్స్ పర్సన్

ఇంటింటికీ వెళ్లి చెబుతున్నాం



అడ్డగుట్ట ఏరియాలో ఎక్కడ చెత్త లేకుండా చూస్తున్నాం. ఉదయాన్నే కాలనీలు బస్తీలకు వచ్చి ఇంటింటికి ప్రచారాలు నిర్వహిస్తున్నాం. ఎవరు కూడా చెత్త వేయకండి.. మీ ఇంటికే నేరుగా చెత్త తీసుకెళ్లేందుకు వస్తారని, అందులోనే వేయాలని సూచిస్తున్నాం. అడ్డగుట్టలో ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ అర్థం అయ్యేలా ప్రచారం చేస్తున్నాం. కొందరు ఆటోలో చెత్త వేయడానికి ఇష్ట పడడంలేదు.

- ప్రేమలత, రిసోర్స్ పర్సన్

జీహెచ్‌ఎంసీ సిబ్బంది బాగా పనిచేస్తున్నారు



ప్రతిరోజు తెల్లవారుజామున అడ్డగుట్టకు చేరుకుంటున్నాం. ప్రతి బస్తీలోకి వెళ్లి ఎక్కడైతే చెత్త ఉంటుందో ఏరివేస్తున్నాం. ముఖ్యంగా రోడ్లపైన క్లీన్‌గా ఉండేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. తన వద్ద పనిచేస్తున్న సిబ్బంది క్రమం తప్పకుండా పనిలో ఉంటున్నారు. ఆర్‌ఆర్‌సీ మైదానం వద్ద ఖాళీ ప్రదేశంలో కొందరు మలవిసర్జన చేస్తున్నారు. అందుకోసం ప్రతి రోజు తెల్లవారుజామున అక్కడికి వచ్చి దుర్వాసన రాకుండా ఉండేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం.

- జబ్బర్, సూపర్‌వైజర్ జీహెచ్‌ఎంసీ

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేస్తున్న దృశ్యం

బేగంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని మాతాజీనగర్ సమీపంలోని ఓ బడా కంపెనీ వెంచర్‌లో అక్రమంగా వెలసిన నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు శనివారం కూల్చివేశారు. ఉదయం సుమారు 5 జేసీబీలతో బేగంపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి క్రిష్టోఫర్‌తో పాటు పలువురు అధికారులు పోలీస్ ప్రొటక్షన్‌తో కూల్చివేతలు చేపట్టారు. బాలానగర్ మండల పరిధిలోని బేగంపేట మాతాజీనగర్‌లోని సర్వే నెంబరు 194/8/1లోని సుమారు 10 ఎకరాల 20 గుంటల్లో 2015 సంవత్సరంలో ప్రైడ్ ఇండియా రియల్ ఎస్టేట్ కంపెనీ అక్రమ లేఅవుట్ చేసింది. ఈ వెంచర్‌లో 300లకు పైగా ప్లాట్‌లను వేసి పలువురికి విక్రయించారు. దీంతో అప్పట్లోనే జీహెచ్‌ఎంసీ, నీటి పారుదల శాఖలకు ఫిర్యాదులు రావడంతో ఇక్కడ వెలసిన నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు స్థల యజమానులపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అధికారులు కూల్చిన కొద్ది రోజులకే మళ్లీ ఇక్కడ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇలా 2019, 2021 సంవత్సరంలో సైతం కూల్చివేతలు నిర్వహించారు. తాజాగా ఇటీవల ఎమ్మెల్యే ఎలక్షన్‌ల సమయంలో ఈ వెంచర్‌లో సుమారు 50కి పైగా నిర్మాణాలు జరిగాయి. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో వారం రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ నిర్మాణాలు చేయవద్దని తెలిపారు. అందులో భాగంగా శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు పెద్ద ఎత్తున జేసీబీలతో వచ్చారు. వెంచర్‌లో ఉన్న అన్ని ఇళ్లను కూల్చివేశారు. ఇళ్లలో ఉన్న వారిని వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇళ్ల కూల్చివేత క్రమంలో పలువురు ఇంటి యజమానులు అధికారులను అడ్డుకున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి స్థలాలు కొన్నామని, రిజిస్ట్రేషన్లు సైతం అయ్యాయని, కొన్న స్థలంలో ఇళ్లు నిర్మిస్తే ఎందుకు కూలుస్తున్నారని వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల సహాయంతో వెంచర్‌లోని అన్ని నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జంపన్న ప్రతాప్, వివేకానంద అసోసియేషన్ సభ్యులు



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బోయినపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం చిరుప్రాయంలోనే తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను నేటి యువత అనుసరిస్తూ దేశ భక్తిని పెంపొందించుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ అన్నారు. శనివారం సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌సింగ్‌ల వర్ధంతిని బోయినపల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద బోయినపల్లి స్వామి వివేకానంద సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జంపన్న ప్రతాప్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు శశిరాజ్ యాదవ్, దయానంద్ యాదవ్, మల్లేష్ యాదవ్, ప్రకాష్ యాదవ్, ముత్యాలు, బాలరాజ్, వర్మ, అజిత్, వినోద్ కుమార్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ సేవలు మరువలేనివి

అమీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి చిన్న వయస్సులోనే ఉరికొయ్యల ఉగ్గుపాలు తాగి అసువులు భాసిన అమరుడు కామ్రెడ్ భగత్‌సింగ్ అని మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం అమీర్‌పేటలోని సత్యం టాకీస్ చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిక్కు సోదరులు పాల్గొన్నారు.



రామాయంపేటలో నిందితురాలిని చూపుతున్న తూప్రాన్ డీఎస్పీ

నగలు అపహరించే.. పాత నేరస్థురాలి గుట్టురట్టు

- రామాయంపేటలో నగల చోరీ కేసు
- నిందితురాలి పట్టివేత
- పది తులాల ఆభరణాల రికవరీ

రామాయంపేట, మార్చి 23: రాజధాని నగరంలో మహిళలను మభ్యపెట్టి నగలు ఎత్తుకెళ్లే ఓ పాత నేరస్థురాలి గుట్టురట్టు చేశారు మెదక్ జిల్లా రామాయంపేట పోలీసులు. గత రెండేళ్లుగా బేగంపేట, సికింద్రాబాద్ మహంకాళి వీధి తదితర ప్రాంతాల్లో సదరు నిందితురాలు చోరీలకు పాల్పడేది. ఈ క్రమంలో ఈనెల 13న రామాయంపేట బస్టాండులో ఓ ప్రయాణీకురాలి బ్యాగు నుంచి పది తులాల బంగారు నగలు దొంగిలించగా పది రోజుల వ్యవధిలోనే చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు కేసును ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి శనివారం రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. నిజామాబాద్ పట్టణానికి చెందిన గంగోలి గౌతమితో పాటు తన తోటి కోడలు మాధురి కలిసి హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో నిజామాబాద్‌కు బస్సులు దొరక్క కొంపల్లిలో బస్సు ఎక్కిన ఆమె రామాయంపేటలో దిగింది. అప్పటికే ఆమెను వెంబడించిన హైదరాబాద్ బొల్లారం ప్రాంతానికి చెందిన శారద అనే నిందితురాలు బ్యాగులో ఉంచిన నగలను దొంగిలించే ప్రయత్నం చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో స్థానిక బస్టాండులో నిజామాబాద్ బస్సెక్కిన గౌతమి బ్యాగులోంచి 10 తులాల నగలను అపహరించింది. పిదప బాధితురాలు గౌతమి తన బ్యాగ్‌ను పరిశీలించగా నగలు పోయిన విషయాన్ని గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు శనివారం ఇక్కడి బైపాస్‌లో వాహనాల తనిఖీలు చేపట్టగా అనుమానస్పదంగా తిరుగుతున్న శారదను అదుపులోకి తీసుకుని విచారించారు. అసలు విషయం బయటపెట్టటంతో శనివారం ఆమెను రిమాండుకు తరలించారు. కాగా డీఎస్పీ వెంట సీఐ వెంకట్, ఎస్సై రంజిత్‌లు ఉన్నారు.



మాట్లాడుతున్న గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్

కల్లు దుకాణాలపై పోలీస్ దాడులను ఆపాలి

బేగంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ మాఫియా అండతోనే పోలీసులు కల్లు దుకాణాలపై దాడులు చేస్తున్నారని, వెంటనే దాడులను ఆపకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. శనివారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర స్థాయి కార్యవర్గ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిక్కర్ మాఫియాతో పోలీసులు కుమ్మక్కై కల్లు దుకాణాలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ దాడులను వెంటనే ఆపాలన్నారు. కల్లు షాపులు నిర్వహించే వారిపై బైండోవర్ కేసులు పెడతామని పోలీసులు బెదిరించడం దారుణమన్నారు. ఈ సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో నగరంలో 'గౌడ గర్జన' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రశాంత్ గౌడ్, సంతోష్ గౌడ్, సంజీవగౌడ్, అనురాధ, దేవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



కోట నీలిమ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన టీడీపీ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

అమీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ సమక్షంలో శనివారం టీడీపీ, బీఆర్ఆస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బాపునగర్‌కు చెందిన విద్యార్థి చౌహాన్, అమీర్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడితో పాటు అంకమ్మ బస్తీకి చెందిన రంగమ్మ, సాయితో పాటు మరో వంద మంది చేరినట్లు డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు వెల్లడించారు.

లాడ్జీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తదితరులు

రెజిమెంటల్‌బజార్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లాడ్జీ నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని మహంకాళి డివిజన్ ఏసీపీ సర్దార్‌సింగ్ అన్నారు. శనివారం మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో లాడ్జీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్టమర్‌ల వద్ద విధిగా ఆధార్ కార్డు తీసుకోవాలని, ఏ పని మీద వచ్చారో, ఎక్కడి నుంచి వచ్చారో తదితర వివరాలను రికార్డు బుక్‌లో నమోదు చేయాలని అన్నారు. మైనర్‌లకు గదులు ఇవ్వరాదని సూచించారు. సీసీ కెమెరాలు పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా అనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సైలు మమత, శ్రీవర్ధన్, గిరిధర్, సిబ్బంది, లాడ్జీల నిర్వాహకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, విద్యార్థులు

టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

మారేడుపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని పికెట్ యూపీహెచ్‌సీ కేంద్రం వైద్యాధికారి ఎం.విశాల్‌రాజ్ అన్నారు. శనివారం కంటోన్మెంట్ టీబీ యూనిట్ అధ్వర్యంలో వరల్డ్ డే ను పురస్కరించుకొని పికెట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పికెట్ డిస్పెన్సరీ నుంచి పికెట్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.విశాల్ రాజ్, టీబీ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్లు మహదేవ్, నవీన్, హరామన స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో అవగాహన కార్యక్రమం

అడ్డగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీబీ నివారణ నిర్మూలన విషయంలో వైద్యులు ప్రజల్లో అవగాహన తీసుకురావాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా గాంధీ మెడికల్ కాలేజీలో అలుమినీ భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ వైద్య మిషిన్ సీనియర్ రీజినల్ డైరెక్టర్ ఎం. అనురాధ, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ అదనపు డీఎంఈ డాక్టర్ రమేష్ రెడ్డి, టీబీ అసోసియేషన్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్‌ఎం తెలంగాణ జాయింట్ డైరెక్టర్ రాజేశం, గాంధీ ఆస్పత్రి పల్మొలాజీ విభాగాధిపతి కృష్ణమూర్తి, రాష్ట్ర టీబీ విభాగం అధికారులు వైద్యులు వాసుప్రసాద్, జితేంద్ర, ఆదిత్య, సివిల్ సర్జన్ డాక్టర్ సుమలతలు పాల్గొని క్షయ వ్యాధి నిర్మూలన కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



మాట్లాడుతున్న కంటోన్మెంట్ బీజేపీ నాయకులు

శ్రీగణేష్‌కు కంటోన్మెంట్ ప్రజలు గుణపాఠం చెప్పాలి

బోయినపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పార్టీల కండువాలు మారుస్తూ అటు పార్టీలను, ఇటు కార్యకర్తలను మోసం చేస్తున్న శ్రీగణేష్‌కు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ నాయకులు కంటోన్మెంట్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ బీజేపీ కన్వీనర్ విజయానంద్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శనివారం డైమండ్ పాయింట్‌లోని ఓ హోటల్‌లో సమావేశం ఏర్పాటుచేశారు. శ్రీగణేష్‌కు గత ఎన్నికలలో వచ్చిన ఓట్లు కూడా బీజేపీ పార్టీని చూసి వేసిన ఓట్లే అని అన్నారు. గత ఎన్నికలలో ఆయన సామాజికవర్గం అర్వమాలల ఓట్లు కూడా రాబట్టుకోలేకపోయారని, ఆయనకు నిజంగా ప్రజాదరణ ఉంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేయాలని సవాల్ విసిరారు. శంకర్, అశోక్, వరుణకుమార్, వీరవర్ధన్, ప్రశాంత్, రాజ్‌మల్లేష్, కనకరాజు, అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సహజసిద్ధమైన రంగులను పంపిణీ చేస్తున్న దిశా జైన్, స్థానికులు

హోలీ పండుగకు సహజ సిద్ధమైన రంగులే వాడాలి

బోయినపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'రసాయన రంగులు వద్దు.. సహజ సిద్ధమైన రంగులే ముద్దు' అని జైన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దిశాజైన్ అన్నారు. హోలీ పండుగ సందర్భంగా ప్రజలు సహజసిద్ధమైన రంగులు వాడాలనే సంకల్పంతో శనివారం బోయినపల్లి బాపూజీనగర్‌లోని విద్యార్థులకు సహజసిద్ధమైన రంగులు, మిఠాయిలు, రంగులు చల్లుకునే పిచికారీ వస్తువులను 200 మంది విద్యార్థులకు స్థానికనాయకుడు జంపన్నప్రతాప్‌తో కలిసి దిశాజైన్ పంపిణీ చేశారు. శ్రీకాంత్, అజిత్‌కళ్యాణ్, రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్ జ్యోతిని శనివారం తుకారాంగేట్ సాయినగర్ అడ్డగుట్టలోని మహిళా సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు జ్యోతి, పద్మ, వాణి, విజయ, లక్ష్మి, కీర్తి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్ట్ అక్రమం

అమీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ దర్యాప్తు సంస్థలను వాడుకుంటూ అక్రమ అరెస్టులకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని అమ్ఆద్మీ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి జైసింగ్ జాదవ్ అన్నారు. శనివారం బాపునగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డిల్లీ మద్యం స్కాంలో కేజ్రీవాల్ ప్రధాన నిందితుడని ఈడీ పేర్కొనడం దారుణమన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బోయినపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని ఓ వ్యక్తి తనగదిలో ఆత్మహత్య చేసుకొని అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా దొంగల రామారం గ్రామానికి చెందిన వెంకటేశ్(50) మొదటి భార్య మృతి చెందటంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండో భార్య కూడా వేంకటేశ్‌తో గోడవపడి వెళ్లిపోయింది. కొంతకాలంగా చిన్నతోకట్టలో వెంకటేశ్ ఒంటరిగా నివాసముంటున్నాడు. శనివారం వెంకటేశ్ ఉంటున్న గది నుంచి దుర్వాసన రావటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బయట నుంచి గడియవేసి ఉన్న తలుపులను తెరిచి చూసేసరికి వెంకటేశ్ ఉరి వేసుకుని కనిపించాడు. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో ఐదారురోజుల క్రితమే ఈ ఘటన జరిగి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే గదికున్న కిటికీలన్నీ మూసి ఉండటం, తలుపులకు బయట నుంచి గడియ వేసి ఉండటంతో ఇది హత్య లేక ఆత్మహత్యా అన్నకోణంలో కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364